## ఆశ్రమవాసికపర్వ కథాంశాలు

ఈ పర్వమున మూడు ఉపపర్వములు కలవు. 1. ఆశ్రమవాసపర్వం 2. పుత్రదర్శనపర్వం 3. నారదాగమనపర్వం. ఈ మూడింటియందు కలిపి 39 అధ్యాయములు కలవు. 1082 శ్లోకాలు వున్నాయి.

**ఆశ్రమవాసపర్వ : -**

అశ్వమేధయాగానంతరము ధర్మరాజు గాంధారి ధృతరాష్ట్రులకు పరిచర్యచేయుచూ రాజ్యమేలుచుండెను. పాండవులందరునూ (కుంతితో సహా) గాంధారీ ధృతరాష్ట్రులకు కావలసిన పరిచర్యలు చేయుచూ వారిమనస్సును సంతోషపెట్టుచున్నారు. ఒకనాడు ధృతరాష్ట్రుడు పాండవుల అందరితో ఇట్లనినాడు. ఇంతవరకూ జరిగిన కురువంశ నాశనము నా అపరాధము వలననే జరిగినది. అసలు దుర్యోధనుని కౌరవాధిపతిగా అభిషేకించుటయే నేను చేసిన తప్పు. కృష్ణుని మాటను భీష్మద్రోణుల మాటలను సహితము పెడచెవిని పెట్టి గుణవంతులైన పాండుపుత్రులను దూరము చేసితిని. కురవంశనాశనము జరిగి 15 సంవత్సరములు గడిచినవి. నామనస్సు ఈ విషయమై ఎంతో వ్యధ చెందుతున్నది. నాకు అన్నము కూడా సరిగా సహించుటలేదు. ఒక్కొక్క రోజున అసలు భోజనమే నేను విడిచిపెట్టుచున్నాను. నియమము నెపముతో భూమిమీద శయనించుచున్నాను. అందుచే నామనస్సు కుదుటపడవలె నన్నచో నేను వనవాసమునకు వెడలుట శ్రేయస్కరము అని తోచుచున్నది. దీనికి ధర్మరాజు అనుమతించవలెనని కోరుతున్నాను.

ఈ మాటలు విని ధర్మరాజు నిర్విణ్ణుడైనాడు. తండ్రీ! మిమ్ము సుఖపెట్టలేని ఈ రాజ్యము నాకెందులకు? "తల్లివైనా, తండ్రివైనా నీవే మాకు. నేను రాజును కాను. మీరే ఈ మహారాజ్యమునకు మహారాజులు. నేను మీ ప్రతినిధిని మాత్రమే. మీ నిశ్చయము వలన మేము మీరాజ్యములోని ప్రజలు అందరము మిక్కిలి విచారించుచున్నాము. మీకు దుర్యోధనాదులు ఎటువంటివారో మేము అటువంటివారమే. మమ్ముకాదని మీరు వనవాసమునకు ఏగినచో మీవెంట మేమూ వచ్చెదము. మీకు శుశ్రూష చేయుచూ అచ్చటనే గడిపెదము." ఇట్లనుచుండగానే అచ్చటకు వ్యాసమహర్షి యేతెంచినాడు. వ్యాసుడు ధర్మరాజుతో ఈరాజు

పెద్దవాడైనాడు. గాంధారి కూడా ప్రాజ్ఞురాలు. ఎట్లో పుత్రశోకమును దిగమింగుచున్నది. నేను కూడా ధృతరాష్ట్రుడు చెప్పినట్లే చెప్పుచున్నాను. వారికి వనవాసమునకు అనుజ్ఞ ఇవ్వు. పూర్వరాజర్షులందరునూ చివరకు ఇట్లే ఆశ్రమవాసము చేసినారు. క్షత్రియధర్మము సహితమూ ఇదియే . క్షత్రియుడు యుద్ధమునందైననూ మరణించవలెను, లేదా వనవాసములోనైననూ మరణించవలెను. ఇప్పటికతడు ఎన్నియో యజ్ఞములు చేసినాడు. నీ పరిచర్యలను గ్రహించినాడు. రాజ్యమంతయూ నీచేతిలో పెట్టినాడు. నీవు వనవాసమునకు వెళ్లినప్పుడు 13 సంవత్సరములు పుత్రుని ఆధీనములోనున్న రాజ్యభోగమును అనుభవించినాడు. ఇక అతనిని తపస్సుకై వనమునకు వెళ్లనిమ్ము. ధర్మజా! నీమీద అతనికి ఇసుమంతయూ కోపము లేదు. ఈ మాటలు చెప్పి మహర్షి వెడలిపోయినాడు.

ధృతరాష్ట్రునికి సంతోషము కలిగినది. యుధిష్ఠిరునికి రాజనీతిని ఉపదేశించినాడు. ఈ రాజనీతి పాండవులమీది అనురాగమును ప్రజలమీది ఆనుకూల్యమునూ ప్రదర్శించుచున్నది. (పూర్వము కణికుడు చెప్పిన రాజనీతికినీ ఈ రాజనీతికినీ చాలా భేదము కలదు.) తర్వాత ప్రజలందరూ ధృతరాష్ట్రుని చూడవచ్చిరి. ప్రజలకు కూడా ధృతరాష్ట్రుడు రాజనీతిని తెల్పినాడు. క్షత్రియధర్మము సూక్ష్మముగా ఉపదేశించినాడు. తన పరిస్థితిని తెల్పి తనకు అనుజ్ఞనిమ్మని ప్రజలను వేడుకున్నాడు. ప్రజలందరూ తమ ఆనుకూల్యమును తెల్పిరి.

ఆ మరునాడు పితరులకు శ్రాద్ధ మొనరింపవలెనని ధృతరాష్ట్రునకు సంకల్పము కలిగినది. దానికి తగినంత ధనము తెమ్మని విదురుని ధర్మరాజు కడకు పంపినాడు. ధర్మజుడూ, అర్జునుడూ సంతోషముగా తమ తమ ధనములను ఇచ్చుటకు అంగీకరించిరి. కానీ భీముడు అంగీకరింపలేదు. అర్జునుడు భీముని సముదాయించి ధృతరాష్ట్రునికి యథేచ్ఛగా ధనము ఇచ్చినాడు. భీముని పక్షమున ధృతరాష్ట్రుని అర్జునుడు క్షమింపుమని కోరినాడు. అవిఅన్నియూ మనస్సున ఉంచుకొనక పితరులకు శ్రాద్ధమొనర్చి ధృతరాష్ట్రుడు కర్తవ్యనిర్వహణమొనర్చినాడు. ఎన్నియో దానములు అర్హులైన విప్రులకు ఇచ్చినాడు. 10 రోజులు ఇట్లు చేసి పితరుల ఋణము తీర్చుకున్నాడు. అప్పుడందరి అనుజ్ఞను గైకొని ధృతరాష్ట్రుడు గాంధారితో సంజయునితో విదురునితో వనమునకు

బయలుదేరినాడు. వారివెంట కుంతీదేవీ కూడ గురుశుశ్రూష చేయవలెనను తలంపుతో వనవాసమునకు తానూ బయలుదేరినది. పాండవులందరికీ ఇది శరాఘాతమైనది. తల్లిని వనవాసమునకు వెళ్లవద్దని కుంతిని పాండవులు బ్రతిమాలిరి. కాని కుంతి వినలేదు. గాంధారీ ధృతరాష్ట్రులతో తానునూ వనవాసమునకు వెళ్లినది.

వనములో ధృతరాష్ట్రాదులకు నారదమహర్షి కనిపించాడు. నారదునితో విషయమంతయూ ధృతరాష్ట్రుడు చెప్పినాడు. శతయూపాశ్రమమున ఉండమని నారదుడు మార్గనిర్దేశము చేసినాడు.

వనవాసమునకు వెడలిన ధృతరాష్ట్రాదులను తలచుకొని పాండవులు, పురజనులూ మిక్కిలి శోకించిరి. వృద్ధులైనవారు ఎట్లు వనములో నివసెంచెదరో కదా అని వారందరూ వాపోయిరి. ముఖ్యముగా పాండవులు కుంతి మీద మనస్సును వెనుకకు మరలించుకొనలేక పోయిరి. ఆమెను గురించి తలచుకొనుచూ ఒకసారి కుంతిని చూచి రావాలని అందరికి మనస్సులో అభిప్రాయము కలిగినది. ముందుగా సహదేవుడు బయటపడి మనమందరమూ మన తల్లిని చూచుటకు వెళ్లవలెనని అనినాడు. ఆ మాటలను ప్రోత్సాహించినది ద్రౌపది. అందరునూ అడవికి బయలుదేరిరి. పాండవులందరునూ అశ్రమమునఉన్న గాంధారీ ధృతరాష్ట్రులను, కుంతిని, సంజయుని చూచిరి. సంజయుడు అక్కడి ఆశ్రమవాసులందరికీ పాండవులను పరిచయము చేసెను. వారందరూ అతిథులైన పాండవులకు సముచితమైన సత్కారములు చేసిరి. మాటల సందర్భమున ధర్మరాజు విదురుని గురించి అడిగినాడు. విదురుడు కనిపించడేమి అని గుచ్చి గుచ్చి అడిగినాడు. అప్పుడు ఆ ఋషులు "విదురుడీమధ్య అశ్రమములో సరిగా ఉండుటలేదనియూ వనమంతయూ తిరుగుచున్నాడనియూ ఎప్పుడు ఎక్కడవుండునో తెలియటంలేదనియూ సరిగా చెప్పవలెనన్నచో అతడు మనలో లేడనియూ" చెప్పినాడు. ఇట్లు చెప్పుచుండగనే అల్లంత దూరమున విదురుడు దిగంబరుడై గబ గబా వెళ్లిపోవుచున్నాడు. ఋషులలో ఒకడు విదురుని చూపించి ధర్మరాజుకు తెల్పినాడు. ధర్మరాజు వెంటనే విదురుని పిల్చినాడు. విదురుడు వెనుతిరగలేదు, మాట్లాడలేదు. ధర్మరాజు వెంటనే అతనిని వెంటాడినాడు. విదురుడు మరింత వేగముగా వెళ్లిపోయెను. ధర్మరాజుకూడా విడువక అతని వెంటాడుచుండెను. ఏమి అడ్డమువచ్చిననూ పొదలలోనుండి

శరీరము రక్తసిక్తమవుచున్ననూ విదురుడు నిశ్చింతగా వెళ్లిపోవుచుండెను. విదురా! విదురా! అని కేకలు వేయుచూ విదురుని వెంట ధర్మరాజు పరిగెత్తెను. విదురుడు వెళ్లి వెళ్లి ఒక చెట్టుకు ఆనుకొని నిలబడెను. దగ్గరకు వెళ్లి ధర్మరాజు "విదురా! మాట్లాడవేమీ నేను ధర్మరాజును నీకు వినిపించుటలేదా" అని ఏమేమో అనుచుండెను. అప్పుడే విదురుని శిరస్సు నుండి ఒక జ్యోతి వెడలివచ్చి ధర్మరాజులో కలసిపోయెను. ధర్మరాజు మిక్కిలి దుఃఖించి అతని శరీరమునకు అగ్నిసంస్కారములు చేయ సంకల్పించెను. ఇంతలో అశరీరవాణి "అతడు సన్యాసి
అయినాడు మీరు చేయు సంస్కారములు ఇప్పుడతనికి అవసరము లేదు. దానికి తగనటువంటి ఏర్పాటులు మహర్షులు చేస్తారు. మీరు స్పృశించకుడు" అని అశరీరవాణి వినిపించెను. పిమ్మట ధర్మరాజు వెనుకకు మరలి ధృతరాష్ట్రునివద్దకు వెళ్లి జరిగిన వృత్తాంతమంతయు చెప్పెను. పాండవులు ధృతరాష్ట్రాదులూ వారందరునూ విషాదమునూ అశ్చర్యమునూ పొందినారు. ధర్మరాజు ధృతరాష్ట్రాదుల యోగక్షేమములన్నియూ పరిశీలించెను. శతయూపాదిమహర్షులు, శిష్యగణంతో వ్యాసమహర్షి ధృతరాష్ట్రుని చూచుటకు వచ్చిరి.

**పుత్రదర్శనపర్వము : -**

పాండవులు అక్కడ ఉండగానే వ్యాసమహర్షి వచ్చినాడు. ధృతరాష్ట్రుని తపస్సు చక్కగా జరుగుచున్నదా? అని అడిగినాడు. వనవాసముతో నీ మనస్సు కుదుటపడినదా? నీపుత్రశోకము తగ్గినదా? ఆరణ్యముకములైన విధులన్నీయూ నిర్వ ర్తించుచున్నావా? కోడలు గాంధారికి నీపరిచర్యలు ఏమీ కష్టము అనిపించుటలేదుకదా? అహంకారము విడిచి కుంతీదేవి కూడా నీకు చక్కగా పరిచర్యలు చేయుచున్నదా? పాండవులను ముఖ్యముగా ధర్మరాజును అభినందించితివా? నీమనస్సు నిర్మలమైనదా? జ్ఞానము కలిగినదా? అని అడిగి మధ్యలో ఒకచక్కని ఉపదేశము చేసినాడు. ఆ ఉపదేశసారాంశము ఇది. ప్రాణులన్నిటికీ మూడేమూడు ముఖ్యలక్షణములు ఉండవలసినవి. 1. వైరము లేకుండుట 2. సత్యము 3. కోపము లేకుండుట. నీమనస్సు

మోహమునకు లొంగక నీవశమై ఉన్నదా? వన్యాహారము చక్కగా లభించుచున్నదా. విదురుడు వెళ్లిపోయినాడు కదా? ఆయన మహాయోగి. మాండవ్య శాపముచే యముడే విదురుడుగా జన్మించినాడు. దేవతలలో బృహస్పతి వంటివాడు విదురుడు. అంతేకాదు దానవులలో శుక్రుడివంటివాడు. విదురునిలో సత్యము, శమదమములూ, అహింసా, దానము, తపస్సు ఇవి అన్నియూ గూడు కట్టుకొని ఉన్నవి. యోగబలముతో జన్మించిన ధర్మరాజు కూడా యమధర్మరాజు అంశయే. అందుకే విదురుడు చివరకు ధర్మరాజులోనికి ప్రవేశించినాడు. నీకు కూడా త్వరలో శ్రేయస్సు కల్గును. నీ సంశయములు ఏమైనా ఉన్నచో అడుగుము తీర్చెదను. నీకాశ్చర్యమును కల్గునట్లుగా తపస్సు యొక్క ఫలమును ఇప్పుడే చూపింతును. నీకు కావలసినదేమియో కోరుకొనుము. తప్పక చేసెదను అనినాడు.

ధర్మరాజాదులు అక్కడ ఉండగానే నారదుడు మొదలైన దేవర్షులు, తుంబురుడు,
విశ్వావసువు మొదలగు గంధర్వులు అచ్చటకు వచ్చిరి. అప్పుడే చనిపోయిన వారిని గురించి విలపించుచూ కుంతీదేవి కూడా కర్ణుని గురించి చెప్పినది. వ్యాసమహర్షి ఇందు నీదోషమేమియూ లేదు మనుష్యధర్మమును మించినది దైవధర్మము. రెండిటికీ విరోధము కల్గినపుడు దైవధర్మమే నెగ్గి తీరును. ధర్మము ముందు ఎవరైననూ తలవంచవలెను. అని కుంతిని ఓదార్చినాడు. అప్పుడు వ్యాసమహర్షి వారివారి పూర్వచరిత్రలను చెప్పి మీరుచూడదలచినచో రణమృతులను సైతము చూపించెదను అని అనినాడు. దానిని చూచుటవలన మీకు పరలోకభయము కలగదు. అని సూచించినాడు. అందరనూ గంగానదికి నడువుమని ఆదేశించినాడు. గంగాతీరమునకందరునూ చేరిరి. ఇంతలో సూర్యాస్తమయమైనది. సాయంకాల కృత్యములు తీర్చుకున్నారు. చీకటి అలముకున్నది. మరుక్షణములో నీటిలోనుండి పెద్దశబ్దము వచ్చినది. వెనువెంటనే గొప్ప తేజస్సు కనిపించినది. కురుపాండవ సైనికులందరునూ ఆ తేజస్సులో దర్శనము ఇచ్చిరి. భీష్ముడు, ద్రోణుడు, విరాటుడు, ద్రుపదుడూ, కర్ణుడూ, దుర్యోధనుడూ, శకుని మొదలైన వీరులందరూ కనిపించారు. దివ్య తేజస్సుతో ప్రకాశించుచున్నారు. పూర్వమువలె వారి వారి రథాలతో ధ్వజములతో సహా కనిపించారు. వెంటనే వ్యాసమహర్షి

ధృతరాష్ట్రునకు దివ్యదృష్టి నిచ్చినాడు. అదిఅంతయూ తన తపోబలముతో చేసినాడు. గాంధారికి కూడా దృష్టిని ప్రసాదించినాడు. వారందరూ మనస్సులలో నిష్కల్మషులై మాట్లాడుకొనుచున్నారు. వారిలో శత్రుత్వములు లేవు. భయములు లేవు. శోకములు లేవు. అందరూ తమ తమ తండ్రులతోనూ, సోదరులతోనూ, పతులతోనూ, సుతులతోనూ సంతోషముగా ముచ్చటలాడిరి. రాజస్త్రీలు కూడా తమ తమ భర్తలతో ప్రసంగములు సలిపిరి. తెలవారవచ్చినది. అందరు తమ తమ నివాసములకు వెళ్లిపోవుచున్నట్లు కనిపించెను. వ్యాసమహర్షి గంగాజలము లోనే ఉన్నాడు. భారతస్త్రీలతో వ్యాసమహర్షి ఇట్లనినాడు. "మీరు మీభర్తలతో కలిసి వెళ్లదలచినచో ఈగంగాజలములో స్నానముచేయుడు." అనినాడు. వారు స్నానములు చేసి మనుష్య దేహములు విడిచి వారిభర్తల సమీపమునకు చేరిరి. మరుక్షణములో శీలవతులైన ఆ స్త్రీలు తమ పతులతో కలిసి ఉత్సాహవతులై విమానములయందు ప్రకాశించిరి. ఇది అంతయూ చూచువారికి చాలా ఆశ్చర్యకర మనిపించెను.

దీనినంతయూ వినుచున్న జనమేజయునకు ఒక సందేహము వచ్చినది. అతడు వైశంపాయనుని అడిగినాడు. "మీరు చెపుతున్నది అంతయూ చాలా ఆశ్చర్యముగా
ఉన్నది. ఇట్లు జరుగునా అనిపించుచున్నది. చనిపోయినవారు పూర్వదేహములతో కనిపించుట నేనెన్నడూ వినలేదు." అని వైశంపాయనునితో అన్నాడు. వైశంపాయనుడు తాను చెప్పదలచిన రీతిలో సమాధానము చెప్పి వ్యాసమహర్షిని తలచుకున్నాడు. వ్యాసమహర్షి వైశంపాయనునికి అపరిమితమైన శక్తిని ప్రసాదించినాడు. వైశంపాయనుడు జనమేజయునితో నీ అనుమానము తీరినదా లేదా చూచెదవా అని అడిగినాడు. ఆ మాటలకు జనమేజయుడు మీరు అనుగ్రహించినచో చనిపోయిన నా తండ్రిని చూడవలెనని ఉన్నది అని అనినాడు. "చూడుము" అని వైశంపాయనుడు జనమేజయునికి దివ్యదృష్టిని ఇచ్చి పరీక్షిత్తు మహారాజును చూపించినాడు. జనమేజయడు మహానందము పొందినాడు.

తర్వాత ధర్మరాజాదులు కుంతీ దేవిని గాంధారిని సంజయుని వీడ్కొని హస్తినాపురమునకు వెళ్లిరి.

**నారదాగమన పర్వము : -**

కొంతకాలమైన తర్వాత ఒకనాడు నారదమహర్షి ధర్మరాజుదగ్గరకు వచ్చినాడు. ధర్మరాజు నారదుని అవసరమైన కుశలప్రశ్నలు వేసి మీరెక్కడినుంచి వచ్చుచున్నారని ధర్మరాజుని అడిగినాడు. నారదుడు దానికి సమాధానముగా ఇట్లనినాడు. "ధర్మజా! మీరందరు మీమనస్సును దిటవు చేసికొనుడు. నామాటలు మీకు కొంత అప్రీతిని కల్గించవచ్చును. కాని ఉన్న విషయము చెప్పక తప్పదు. ఇప్పుడు నేను గంగాతీరము నుండి వచ్చుచున్నాను. అచ్చట గాంధారీ ధృతరాష్ట్రులు కుంతీదేవి దావాగ్నిలో చనిపోయినారు." అని చెప్పినాడు. అదెట్లు జరిగినదో సవివరముగా చెప్పుమని పాండవులు దుఃఖపూర్ణమైన మనస్సుతో నారదుని అడిగిరి. నారదుడిట్లు చెప్పినాడు.

ఒకరోజున గాంధారి ధృతరాష్ట్రులు, కుంతియూ గంగాస్నానమొనరించి నిత్యకృత్యములు తీర్చుకొని గట్టెక్కి తమ ఆశ్రమములోనికి వచ్చుచున్నారు. ఇంతలో ఆ వనమంతయూ దావానలము వ్యాపించినది. పెద్ద గాలి వీచినది. దానితో అడవి అంతయూ తగలబడిపోయెను. తమ ఆశ్రమములోనికి వచ్చి అగ్నిహోత్రమొనరించిన గాంధారి ధృతరాష్ట్రాదులు ఆ అగ్నికి ఆహుతి అయిపోయిరి. అందులోనే మీతల్లి కుంతీ అగ్నికి ఆహుతి అయిపోయినది. చివరగా సంజయుని దూరముగా వెడలిపొమ్మని ఈఅగ్నికి ఆహుతికాకుండా హిమవత్పర్వతము ఎక్కుమని అజ్ఞాపించినాడు ధృతరాష్ట్రుడు. దానితో అతడొక్కడూ బయటపడినాడు.

ఈ మాటలు విని పాండవులందరునూ కన్నీరు మున్నీరుగా విలపించిరి. ఒక మహా సామ్రాజ్యమునకు అధిపతియైన ధర్మస్వరూపుని పితరులకు ఎంతటి దుర్గతి పట్టినదో గదా అని పాండవులందరునూ శోకించినారు. వెంటనే పాండవులు గంగాతీరమునకు చేరిరి. అచ్చటకు వెళ్లగానే అచ్చటి మిగిలిన మహర్షులను అడిగి తెలిసికొని ధర్మరాజు తమ తల్లితండ్రులకు లౌకికాగ్నితో అంత్యక్రియలు జరిపించవలసివచ్చుచున్నదని విలపించినాడు. అచ్చటి ఋషులు వారికాదుర్గతి పట్టలేదనియూ వారు సంస్కారాగ్నిలోనే దగ్ధమైనారని ధర్మరాజుతో చెప్పిరి. అది ఎట్లు పొసగినది అని ధర్మరాజు అడిగినాడు.

వారిట్లు చెప్పిరి గాంధారి ధృతరాష్ట్రులు, కుంతియు నదీస్నానము చేసి ఆశ్రమములోనికి ప్రవేశింపగానే దావాగ్ని అలముకున్నది. అప్పటికే విప్రులు ధృతరాష్ట్రుని అగ్ని హోత్రమును ప్రజ్వలింపచేసి హోమము చేసిరి. ఆసమయములోనే కుంతీ మొదలైన వారు అచ్చటకు ప్రవేశించిరి. వెనువెంటనే దావాగ్ని వారిని కమ్ముకొన్నది. మంత్ర పూతమైన వారి సంస్కారాగ్నియే వారి పార్థివ శరీరములను దహనము చేసినది. వారికి మిగిలిన అంత్యక్రియలను మీరు చేయుడు. అని ధర్మరాజునకు ఋషులు ఉపదేశించిరి. ధర్మరాజు అంతదుఃఖములోనూ కొంతకు కొంత సంతోషించినాడు. వారికి ఉదకప్రదానాది కృత్యములు చేసి పాండవులు హస్తినకు చేరిరి.

**ఇది ఆశ్రమవాసికపర్వ కథాంశము.**